


ఆఫీసుల్లో సీఎం ఫొటో



జిల్లాలోని కలెక్టరు ఛాంబరు నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు చిత్రపటం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ప్రభుత్వం అధికారికంగా సూచించిన చిత్రపటాన్ని మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు మాదిరి ఫొటోను అన్ని కార్యాలయాలకు పంపారు. ఈ రకమైన ఫొటోలను ఏర్పాటు చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

- చిత్తూరు కలెక్టరేట్

కిలో టమోటా రూ.56.70



పుంగనూరు మార్కెట్ యార్డులో సోమవారం కిలో టమోటా ధర రూ.56.70 పలికింది. ముస్లింల పర్వదినం బక్రీద్ సందర్భంగా డిమాండు పెరిగింది. దీంతో ఆదివారం కిలో టమోటా ధర రూ.49.40 ఉండగా.. సోమవారానికి రూ.56.70కి చేరింది. రెండో రకం కిలో రూ.53.40, మూడో రకం రూ.48 చొప్పున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలుచేశారు. పుంగనూరు మార్కెట్‌కు రైతులు 340.99 టన్నుల టమోటాలు తీసుకొచ్చారు.

- పుంగనూరు

నేటి నుంచి పారిశుధ్య డ్రైవ్



జిల్లాలోని 697 గ్రామ పంచాయతీల్లో మంగళవారం నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపడుతున్నారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నారు. ఎక్కడైనా.. ఎవరైనా అలసత్వం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని డీపీవో లక్ష్మి హెచ్చరించారు.


- చిత్తూరు కలెక్టరేట్

21 మండలాల్లో వర్షం



నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం 8 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 21 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం పడింది. చౌడేపల్లెలో 46.6 మి.మీ, నగరి 27.2, పెద్దపంజాణి 27.2, గుడిపాల 27.0, బంగారుపాళ్యం 22.2, పుంగనూరు 20.4, గంగవరం 18.8, విజయపురం 18.2, పలమనేరు 16.4, గంగాధరనెల్లూరు 14.2, బైరెడ్డిపల్లె 13.8, సోమల 10.4, తవణంపల్లె 9.6, ఐరాల 9.2, రొంపిచెర్ల 7.0, పూతలపట్టు 4.6, యాదమరి 4.4, సదుం 4.2, చిత్తూరు రూరల్ 3.6, అర్బన్ 2.0, పెనుమూరు 0.4మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. జూన్ సాధారణ వర్షపాతం 80.8 మి.మీ కాగా, సోమవారం వరకు 106.9 మి.మీ నమోదైంది.

- చిత్తూరు కలెక్టరేట్



స్పందన హాలులో ఏర్పాట్లు

నేటి నుంచి కొత్తపేరుతో..

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 17: 'స్పందన' పేరు మారింది. కొత్త ప్రభుత్వంలో 'ప్రజా సమస్యల ఫిర్యాదులు- పరిష్కారాలు' పేరుతో మంగళవారం నుంచి అమలు కానుంది. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం బక్రీద్ సెలవు కావడంతో మంగళవారం కలెక్టరేట్‌లో నూతనంగా నిర్మించిన స్పందన హాలులో తొలి గ్రీవెన్స్‌డే జరగనుంది. వచ్చే వారం నుంచి ప్రతి సోమవారం రెగ్యులర్‌గా ఈ కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుంది. కాగా, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మార్చి 16వ తేదీ నుంచి స్పందన రద్దయింది. మూడు నెలల గ్యాప్‌తో అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారాల్లో అర్జీదారులు వస్తే కలెక్టరేట్‌లో అధికారులెవ్వరూ అర్జీలు తీసుకునేవారు కారు. ఇటీవల ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న తర్వాత దీని ప్రాముఖ్యత గుర్తించి సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆదేశించడంతో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లతో దీని నిర్వహణకు చర్యలు చేపట్టారు.

నాడు స్పందన లేక.. తగ్గిన అర్జీలు

వైసీపీ ప్రభుత్వంలోనూ ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిలో స్పందన, జగనన్నకు చెబుదాం పేరిట ఈ కార్యక్రమం నిర్వహించారు. అర్జీ సమస్యలను బట్టి 90 రోజుల్లోగా పరిష్కరించేలా సమయం నిర్దేశించారు. ప్రారంభంలో ప్రజలు స్పందనకు భారీగా తరలివచ్చేవారు. ఈ కార్యక్రమంపై అధికారుల్లో పట్టు లేకపోవడం, ముక్తసరి సమీక్షలతో అత్యధిక సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో ప్రజల్లో స్పందనపై అయిష్టత ఏర్పడింది. ప్రారంభంలో జిల్లా నలుమూలల నుంచి ప్రతి వారం 150-200 వరకు అర్జీలు వచ్చేవి. క్రమేపి వీటి సంఖ్య తగ్గిపోయింది.

ఇసుక.. చౌకగా దొరికేనా ఇక!

- టీడీపీ ప్రభుత్వంపై ప్రజల కోటి ఆశలు
- వైసీపీ హయాంలో కృత్రిమ కొరత, ధర ఎక్కువ
- కొత్త పాలసీ కోసం ఎదురు చూపు



చిత్తూరు రూరల్ పాలూరులో డంప్ చేసిన ఇసుక

ఐదేళ్ల ఇసుక కొరత, సమస్యకు చంద్రబాబు ప్రభుత్వం పరిష్కారం చూపుతుందన్న భావనతో ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. 2014లో లాగే తమందరికీ అందుబాటులోకి ఇసుక వస్తుందన్న ఆశావహంతో ఉన్నారు. కొత్త పాలసీ ఎలా ఉండబోతుందోనని ఎదురు చూస్తున్నారు.

- చిత్తూరు సెంట్రల్

జగన్ హయాంలో రాష్ట్రంలోనే కాకుండా జిల్లాలోనూ ఇసుక దందా కొనసాగింది. జేపీ వెంచర్‌ను తెరపైకి తెచ్చి ఇసుకను అక్రమంగా రవాణా చేసి వైసీపీ నాయకులు రూ.కోట్లలో గడించారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే కొంతకాలం పాటు ఇసుక తవ్వకాలు ఆపేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ రంగం దెబ్బతింది. కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయి. దీని ప్రభావం సిమెంట్, స్టీల్, ఇటుక రంగాలపైనా పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సంస్థకు ఇసుక కాంట్రాక్టు ఇచ్చారు. వీరు ఇసుకను తవ్వడంలో నిబంధనలను ఉల్లంఘించారు. నదుల్లో యంత్రాలతో తవ్వి భారీ వాహనాల్లో ఇసుకను తరలించారు. దీంతో నదులు, వాగులు రూపురేఖలు కోల్పోయాయి. జిల్లాలోని కొన్ని చోట్ల వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ ఇసుకను అక్రమంగా తమిళనాడు, కర్ణాటకకు తరలించారు. దీంతో స్థానికంగా ఇసుక అందుబాటులో లేని పరిస్థితి తలెత్తింది. మరోవైపు విపరీతంగా పెంచేసిన ధరలతో ఇసుక బంగారమైంది. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం హయాంలో ట్రాక్టరు ఇసుక రూ.800 నుంచి గరిష్ఠంగా రూ.1200 ఉండేది. టిప్పరు రూ.6 వేల నుంచి రూ.8 వేలకు లభించేది. వైసీపీ హయాంలో ట్రాక్టరు ఇసుక ధర రూ.3 వేల నుంచి రూ.5 వేలకు.. టిప్పరు ఇసుక రూ.8 వేల నుంచి రూ.30 వేలు పెట్టి కొనాల్సిన పరిస్థితి నెలకొంది. పక్క రాష్ట్రాలకు టిప్పర్ల ద్వారా తరలించే ఇసుక ధర రెండింతలైంది. దీంతో ఊరు పక్కనే ఇసుక ఉన్నా.. అంత ధరలు పెట్టి కొనలేక చాలామంది ఇళ్ల నిర్మాణాన్ని ఆపేశారు. ఇలా పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల నెరవేరకుండా చేశారు.



పూతలపట్టు మండలం వావిల్‌తోటలోని ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు, గనుల శాఖ డీడీ కేఎల్‌వీ ప్రసాద్ (ఫైల్ ఫొటో)

ఈ పరిస్థితుల్లో మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఇసుక కష్టాలు తీరుతాయని భవన నిర్మాణ కార్మికులు, సామాన్యులు భావిస్తున్నారు. ఇసుక చౌకగా, అందుబాటులోకి వస్తే ఇన్నాళ్లు కుదేలైన భవన నిర్మాణ రంగం ఊపందుకోనుంది.

జిల్లాలో నాణ్యమైన ఇసుక

నాణ్యమైన ఇసుక లభ్యతకు చిత్తూరు మారు పేరుగా నిలిచింది. గనుల శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 14 రీచ్‌లు, నాలుగు స్టాక్ పాయింట్లు ఉన్నాయి. బీఎన్ కండ్రిగ, అనంతాపురం, ముట్టుకూరు, ముక్కళ్ళత్తూరు, ముక్కరవారిపల్లి, ఓజీకుప్పం, కొత్రకోణ, ఆనగల్లు, ఉత్తరబ్రాహ్మణపల్లి, వావిల్‌తోట, వీటిలోనే రెండో రీచ్‌లుగా మరో నాలుగు ఉన్నాయి. పాలూరు, దిగువమాసపల్లె, పూతలపట్టు, వీరగనెల్లూరుల్లో గనుల శాఖ ఆధ్వర్యంలో నాలుగు స్టాక్ పాయింట్లు నడుస్తున్నాయి. ప్రస్తుతం పాలూరు, దిగువమాసపల్లె స్టాక్ పాయింట్లలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉన్నట్లు గనుల శాఖ అధికారులు లెక్కలు కట్టారు. వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలను అతిక్రమించి 10 అడుగుల నుంచి 15 అడుగుల లోతుకు యంత్రాలతో తవ్వకాలు చేపట్టారు. ప్రస్తుతం నదులు, వంకల్లో, రీచ్‌ల్లో ఇసుక లభ్యత ఎన్ని క్యూబిక్ మీటర్లలో ఉంటుందని లెక్కలు కట్టడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతానికి జిల్లాలోని ఇసుక రీచుల్లో తవ్వకాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం తీసుకొచ్చే పాలసీ ప్రకారం త్వరలోనే ఇసుక తవ్వకాలు మొదలుకానున్నాయి.

ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా చర్యలు

కొత్త ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగానే ఇసుక విక్రయాలపై చర్యలు చేపట్టనున్నాం. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రస్తుతానికి రీచ్‌లో ఇసుక తవ్వకాలు నిలిపివేశాం. నూతన ఇసుక విధానం రాగానే అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ మేరకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

- కేఎల్‌వీ ప్రసాద్, డీడీ, మైన్స్

అందుబాటులోకి అన్న క్యాంటీన్

- రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో ప్రారంభం





క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ షన్మోహన్, ఎమ్మెల్యే గురజాల తదితరులు - అన్న క్యాంటీన్ వద్ద ప్రారంభ సందడి

చిత్తూరు, జూన్ 17: చిత్తూరులో పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ అందుబాటులోకి వచ్చింది. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఎంప్లాయిమెంట్ కార్యాలయం పక్కన అన్న క్యాంటీన్ సోమవారం పునఃప్రారంభమైంది. రాష్ట్రంలోనే ఇక్కడ తొలుత ప్రారంభించారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ అన్న క్యాంటీన్లను ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. రూ.5 కే ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించారు. అతి తక్కువతో కడుపు నింపే ఈ క్యాంటీన్లు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్న క్యాంటీన్లను మూసేసింది. పేదల కడుపు కొట్టింది. తిరిగి తాము అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లే.. సీఎం కాగా చేసిన ఐదు సంతకాల్లో అన్న క్యాంటీన్ల ప్రారంభం కూడా ఉంది. ఆ వెంటనే అధికారులు గతంలోని భవనాలను శుభ్రం చేసే పనులు చేపట్టారు. ఈ క్రమంలో రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో అన్న క్యాంటీన్‌ను సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జేసీ శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ షన్మోహన్ ప్రారంభించారు. నగరంలోని దినసరి కూలీలు, కార్మికులకు అనుగుణంగా టిఫిన్, మధ్యాహ్న భోజనాన్ని రూ. 5కే వడ్డించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో ప్రారంభించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. రానున్న రోజుల్లో నగరంలో అవసరమైన చోట్ల ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు దివంగత సీఎం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కఠారి హేమలత, నేతలు సురేంద్రకుమార్, కోదండయాదవ్, వరుణ్‌కుమార్, బాలాజీ నాయుడు, డీకే బద్రినారాయణ, సీఎంటీ త్యాగరాజన్, తిరుకుమరన్ సీకే సాయి కృష్ణారెడ్డి, గురజాల సందీప్, కాజూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట నిలబెట్టుకున్న సీఎంకు కృతజ్ఞతలు

అన్న క్యాంటీన్‌ను ప్రారంభించడం ఎన్నికలనాటి మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ పేదల ప్రభుత్వమన్నారు. అందుకే వైసీపీ హయాంలో మూసేసిన అన్న క్యాంటీన్లను తిరిగి తెరచినట్లు పేర్కొన్నారు.

నేడు రైతుల ఖాతాలో పీఎం కిసాన్ నిధులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 17: జిల్లాలోని రైతుల బ్యాంకు వ్యక్తిగత ఖాతాల్లో మంగళవారం ప్రధానమంత్రి కిసాన్ పథకం నిధులు జమ కానున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం 5 ఐదు గంటలకు వారణాసి నుంచి 17వ విడత పీఎం కిసాన్ నిధులు విడుదల చేయనున్నారు. జిల్లాలోని 2,23,371 మంది రైతులకు 2024-25 సంవత్సరానికి గాను మొదటి విడత కింద సుమారు రూ.124 కోట్లు జమ కానున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్రం ఈ నిధులను అందించనుంది.

ఉద్యోగం తీసిస్తామని మోసం

చిత్తూరు, జూన్ 17: ఉద్యోగం తీసిస్తామని చెప్పి ఓ యువతి నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసిన ముగ్గురిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు..చిత్తూరు నగరం సంతపేటకు చెందిన వైష్ణవి(24) అనే యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆమె అవసరాన్ని గుర్తించిన మురకంబట్టుకు చెందిన రాజేష్, విజయ్‌కుమార్‌తో పాటు మరో వ్యక్తి కలిసి ఉద్యోగం తీసిస్తామని చెప్పి రూ.2.90 లక్షలు తీసుకున్నారు. ఇలా డబ్బులు తీసుకుని నెలలు గడుస్తున్నా ఉద్యోగం తీసివ్వలేదు. దీనిపై ఆ యువతి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాక్ పాయింట్లలో జేసీ తనిఖీలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 17: జిల్లాలోని 14 మండల స్థాయి సివిల్ సప్లయ్స్ గోదాముల్లో ఆది, సోమవారాల్లో జేసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేశారు. పంచదార, కందిపప్పు ప్యాకెట్లు నిర్ణీత బరువు కంటే తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వాటిని పంపిణీ చేయవద్దని ఆదేశించారు. జేసీ బంగారుపాళ్యం, ఇరువారంలోని ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేసి, సరుకుల ప్యాకింగ్ తూకాలను పరిశీలించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మోహన్‌బాబు, డీఎస్వో శంకరన్, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ సోమవారంతో ముగిసింది. కార్డుదారుల విజ్ఞప్తి మేరకు మంగళవారం వరకు పొడిగించినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.











చిత్తూరులోని ఈద్గాలో బక్రీద్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు - పలమనేరులో ఈద్గా ప్రార్థనలకు హాజరై పెద్దల సూక్తులను ఆలకిస్తున్న ముస్లింలు - కుప్పంలో ముస్లింల ప్రార్థనలు - సదుం మండలం బూరగమందలోని ఈద్గాహ్‌లో ప్రార్థనలు

త్యాగనిరతికి చిహ్నం బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను సోమవారం జిల్లాలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాలలో సామూహిక నమాజును ఆచరించారు. అక్కడ మతపెద్దలు ధార్మిక ఉపన్యాసం చేశారు. ప్రాపంచిక విషయాలను త్యాగం చేయడంతోనే భగవంతుడిని ప్రసన్నం చేసుకోగలమని వివరించారు. నమాజు తర్వాత ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కొంత మంది నమాజు నుంచి స్థానిక ఖబరస్థాన్లకు చేరుకుని తమ పూర్వీకుల సమాధులను సందర్శించి నివాళులర్పించారు. అక్కడ్నుంచి ఖుర్బానీ ప్రక్రియ సందడి మొదలైంది. తమ పూర్వీకుల పేరిట చాలా మంది ఖుర్బానీ ఇచ్చి మాంసాన్ని బంధువులు, పేదలకు పంచిపెట్టారు. పుంగనూరులో ఉదయం కొద్దిపాటి వర్షంతో ముస్లింలు ఈద్గాలకు వెళ్లలేకపోయారు. దీంతో సమీప మసీదులు, ఇళ్లల్లో ప్రార్థనలు చేసుకున్నారు.

- చిత్తూరు కల్చరల్/సదుం

వర్సిటీల్లో గందరగోళం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కీలక పదవుల్లోని వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ వంటి అధికారులపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. మొన్నటి దాకా వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్ళాయి. కొన్ని అంశాలు హైకోర్టు దాకా వెళ్ళి విచారణలు పెండింగులో వున్నాయి. ఇపుడు ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో హడావిడిగా పలువురు తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. మరికొందరేమో పదవుల్లో కొనసాగేందుకు టీడీపీ నేతలను ఆశ్రయించే ప్రయత్నాల్లో వున్నారు. రాజీనామాలు చేయని వారిని తప్పుకోమంటూ టీడీపీ వర్గాలు ఆందోళనలకు దిగుతున్నాయి.తిరుపతి ఎస్వీయూ నుంచీ కుప్పంలోని ద్రవిడ వర్సిటీ దాకా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు నిలయంగా మారిన వర్సిటీలు ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ప్రక్షాళనకు గురవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కీలక పదవుల్లోని అధికారులపై ఆరోపణలు

వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు

ప్రభుత్వం మారడంతో పలువురి రాజీనామా

పదవుల్లో కొనసాగేందుకు కొందరి యత్నాలు

తప్పుకోమంటూ ఆందోళనలకు దిగుతున్న టీడీపీ వర్గాలు

ఎస్వీయూ నుంచీ ద్రవిడ వర్సిటీ దాకా ఇదే పరిస్థితి

ద్రవిడ వర్సిటీలో ముగ్గురి రాజీనామా



కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో కూడా ప్రభుత్వం మారగానే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రార్ వేణుగోపాల రెడ్డి, రెక్టార్ అనురాధ, అకడమిక్ డీన్ శ్రీనివాసకుమార్ రాజీనామా చేశారు. అయితే రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించకపోవడంతో ప్రస్తుతానికి కొనసాగుతున్నారు. ఇక్కడ వీసీ మధుజ్యోతి గత డిసెంబరులో నియమితులయ్యారు. ఆమెపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా వర్సిటీని గాడిలో పెట్టలేకపోయారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. వర్సిటీలో పనిచేస్తున్న సుమారు 240మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 11 నెలలుగా వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఆమె బాధ్యతలు తీసుకున్నాక కూడా వేతనాలు చెల్లింపులు జరగడం లేదు. రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న వేణుగోపాల్‌రెడ్డిపై అనేక ఆరోపణలున్నాయి. ప్రభుత్వానికి కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులందాయి. కొన్ని కేసులు హైకోర్టులో కూడా పెండింగులో వున్నాయి. ఎవరు వీసీగా నియమితులైనా వర్సిటీలో పెత్తనం మాత్రం వేణుగోపాల్‌రెడ్డిదేనన్న ఆరోపణలున్నాయి.అసలు ఆయన నియామకమే అక్రమమని కొందరు హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు విచారణ పెండింగులో వుండగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచీ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారన్న ఫిర్యాదులూ ప్రభుత్వానికి వెళ్ళాయి. ప్రచురణల విభాగంలో 2011 నుంచీ పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి 2021లో టీచర్లుగా పదోన్నతి కల్పించడంపైనా, వారికి 2011 నుంచీ అరియర్స్ చెల్లింపులు జరపడం మీదా ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్ళాయి. లబ్ధిదారుల్లో ఇదివరకటి చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి సన్నిహిత బంధువు వుండడంతో ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించలేదన్న ఆరోపణలున్నాయి.స్టడీ సెంటర్లు మూతపడడంతో వర్సిటీకి ఆదాయం పడిపోయిందని, చివరికి ఫిక్సెడ్ డిపాజిట్లు కూడా డ్రా చేసి ఖర్చు పెట్టేశారని సమాచారం. ఏటా ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ కూడా వర్సిటీ నిర్వహణకు సరిపోవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం మారడంతో అక్రమాలకు పాల్పడిన అధికారులు హడావిడిగా తప్పుకునేందుకు యత్నిస్తున్నారు.

కొనసాగేందుకు వీసీ యత్నాలు

ద్రవిడ వర్సిటీ వీసీగా వున్న మధుజ్యోతి తండ్రి కొలకలూరి ఇనాక్ ప్రముఖ రచయిత, విద్యావేత్త. గతంలో ఎస్వీయూ వీసీగా కూడా పనిచేశారు.ఆయన తొలుత టీడీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వుండి ఎస్వీయూ వీసీగా పదవి పొందారు. తర్వాత వైసీపీ వైపు మొగ్గు చూపినట్టు ప్రచారం జరిగింది. 2014లో ఆయన మరో కుమార్తె ఆశాజ్యోతి చిత్తూరు ఎంపీగా వైసీపీ టికెట్ కోసం గట్టిగా యత్నించారు. చివరి క్షణంలో అవకాశం తప్పిపోయింది. గతేడాది డిసెంబరులో మరో కుమార్తె మధుజ్యోతి ద్రవిడ వర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ఇపుడు ప్రభుత్వం మారడంతో సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని ఆ వర్గ ప్రముఖుల ద్వారా మళ్ళీ టీడీపీ ప్రభుత్వ మద్దతుతో వీసీగా కొనసాగేందుకు ఆమె కుటుంబం ప్రయత్నిస్తోందని సమాచారం. అందుకే రిజిస్ట్రార్, రెక్టార్ తదితరులు రాజీనామాలు చేసినా వీసీ మధుజ్యోతి మాత్రం రాజీనామా చేయలేదని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి ఛాంబర్‌లో ఇటీవల తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బైఠాయించి మరీ ఆయన్ను పదవి నుంచీ తప్పుకోవాలని డిమాండ్ చేయడం కలకలం సృష్టించింది. ఓ విశ్వవిద్యాలయ వీసీకి తన అధికారిక ఛాంబర్‌లో ఈ తరహా అనుభవం ఎదురు కావడం నిస్సందేహంగా అభ్యంతరకరం, అనైతికం కూడా. అయితే ఈ పరిస్థితి

ఎస్వీయూలో పరిస్థితి అస్తవ్యస్తం

ఏర్పడడానికి దారి తీసిన కారణాలేమిటన్నది లోతుగా తరచి చూడాల్సి వుంది. తక్షణ కారణం ఏమిటంటే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ మద్దతుదారులు నాటి ఎస్వీయూ వీసీ రాజేంద్రప్రసాద్ ఛాంబర్‌లోకి, చివరికి ఆయన బంగ్లాలోకి కూడా చొరబడి పదవి నుంచీ తప్పుకోవాలని గొడవకు దిగారు. ఫోన్లు చేసి మరీ దుర్భాషలాడారు. దీంతో ఆయన తీవ్ర మనోవేదనతో వీసీ పదవి నుంచీ తప్పుకుని వెళ్ళిపోవాల్సి వచ్చింది. వర్సిటీ చరిత్రలో ఏనాడూ లేని ఈ



తరహా అనైతిక వర్తనను, అవాంఛనీయ సాంప్రదాయాన్ని ఐదేళ్ళ కిందట వైసీపీ వర్గీయులే ప్రారంభించారు. ఇపుడు టీడీపీ వర్గీయులు దానికి ప్రతీకారం తీర్చుకునే రీతిలో అదే తరహా నిరసనలకు దిగుతున్నారు. ఇది తక్షణ కారణమే కానీ ఎస్వీయూ పాలనా వ్యవహారాల్లో అనేక అడ్డగోలు నిర్ణయాలు జరిగాయనేది అసలైన కారణం. ప్రస్తుత వీసీ శ్రీకాంత్‌రెడ్డి గతేడాది డిసెంబరులో నియమితులయ్యారు. ఆయన పీలేరు నియోజకవర్గం కలకడ మండలానికి చెందిన పేరున్న రాజకీయ కుటుంబానికి చెందిన వారు. ఆయన కుటుంబం రాజకీయంగా అటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఇటు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కూడా సన్నిహితంగా వుంటోంది. గత డిసెంబరులో మంత్రి పెద్దిరెడ్డి సిఫారసుతోనే వీసీ పదవిలో నియమితులయ్యారు. అప్పటి నుంచీ మంత్రి సిఫారసుతో సుమారు వంద దాకా తాత్కాలిక ఉద్యోగాలు భర్తీ చేశారన్న ఆరోపణలున్నాయి. అకడమిక్ కన్సల్టెంట్ల ఉద్యోగ కాలపరిమితిని 89 రోజుల నుంచీ 11 నెలలకు పొడిగించడం కూడా వివాదాస్పదమైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా మునుపటి తేదీ వేసి 13మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈనెల 4న ఓట్ల లెక్కింపు ఫలితాల్లో టీడీపీ అధికారంలోకి రావడం స్పష్టం కాగానే ఎస్వీయూ రిజిస్ట్రార్ హుస్సేన్ అదే రోజు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన మూడేళ్ళ కిందట అప్పటి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సిఫారసుతో రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి కూడా తప్పుకుంటారని టీడీపీ వర్గీయులు భావించారు. అయితే శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి మాజీ సీఎం నల్లారి కిరణ్, ఆయన సోదరుడు నల్లారి కిషోర్‌లతో సన్నిహిత సంబంధాలున్న కారణంగా వారి సిఫారసుతో పదవిలో కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఆ కారణంగానే టీడీపీ వర్గీయులు గట్టిగా పట్టు బడుతున్నా, చివరికి ఛాంబర్‌లోకి వెళ్ళి బైఠాయించి మరీ నిరసనలు వ్యక్తం చేస్తున్నా వీసీ స్పందించడం లేదని సమాచారం.

వెటర్నరీ వర్సిటీలో కోడ్ ఉల్లంఘనలు

తిరుపతిలోని వెటర్నరీ వర్సిటీలో ఎన్నికల కోడ్ అమల్లో వుండగానే ఉల్లంఘించి మరీ నియామకం జరిగింది.డైరెక్టర్ ఆఫ్ రీసెర్చి పోస్టు ఖాళీ కావడంతో కడప జిల్లా ప్రొద్దుటూరు వెటర్నరీ కాలేజీకి చెందిన పేథాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా వున్న ప్రొఫెసర్ శ్రీలతను నియమించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక జరిగిన ఈ నియామకం వాస్తవానికి ఏపీ సీఈవో నుంచీ అనుమతి తీసుకున్నాక చేపట్టాల్సి వుంది. అయితే సీఈవో



లేదా ఈసీ అనుమతి లేకుండానే రిజిస్ట్రార్ తాత్కాలిక ప్రాతిపదికన నియామకం జరిపారు.తాత్కాలిక నియామకమైనా ఈసీ ముందస్తు అనుమతి తప్పనిసరి. వర్సిటీ పాలకవర్గం అనుమతి కూడా లేదు. దానికి తోడు తాత్కాలిక నియామకం కాల పరిమితి మూడు నెలలు మాత్రమే. అయితే ఏకంగా ఆరు నెలల కాలపరిమితితో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇపుడు ప్రభుత్వం మారడంతో ఈ వ్యవహారం ఏమవుతుందోనని, కోడ్ ఉల్లంఘించి నియామకం జరిపిన అధికారులపై ఎలాంటి చర్యలు వుంటాయోనన్న చర్చ వర్సిటీలో జోరుగా నడుస్తోంది.

మహిళా వర్సిటీలో వీసీ కొనసాగే అవకాశం

పద్మావతీ మహిళా వర్సిటీ వీసీ భారతి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆరోపణలు లేకపోవడానికి తోడు బలిజ సామాజికవర్గానికి చెందిన ఈమెకు ఆ సామాజిక వర్గం అండదండలు లభించే పరిస్థితి నెలకొంది. సౌమ్యురాలుగా, వివాద రహితురాలుగా పేరుండడంతో కొనసాగింపు సమస్య కాబోదని సమాచారం. రిజిస్ట్రార్ రజని మాత్రం కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు.





రుయాస్పత్రిలోని వసతులపై పేషెంటుతో మాట్లాడుతున్న సత్యకుమార్

ప్రభుత్వాస్పత్రుల్లో వసతుల కల్పనకు పెద్దపీట

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

తిరుపతి(వైద్యం), జూన్ 17 : నిరుపేదలకు కార్పొరేటు స్థాయి వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చెప్పారు.తిరుపతిలోని రుయాస్పత్రిని ఆయన సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. అత్యవసర విభాగంలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వారి వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించాక వివరాలను సూపరింటెండెంట్ రవిప్రభను అడిగి తెలుసుకున్నారు.ఓపీ కేంద్రానికి వెళ్లి క్యూలో వున్న రోగులతో మాట్లాడి ఓపీ స్లిప్పులను పరిశీలించారు. మెడిసిన్ వార్డులో రోగులతో పాటు వారి సహాయకులతో కూడా మాట్లాడారు.వార్డుల్లో నీటి సమస్య వుందని రోగులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.రేడియాలజీ విభాగంలో సరైన వసతులు లేకపోవడాన్ని గుర్తించి మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సూపరింటెండెంట్ ఛాంబర్‌లో వైద్యాధికారులతో ఆస్పత్రి పరిస్థితిపై సమీక్షించారు.గత ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ సేవలను అందించాలని కొంత మంది వైద్యులనే నియమించిందని, వైద్య పరికరాలు, గదుల కొరత ఉందని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, సూపరింటెండెంట్ రవిప్రభ ఆయన దృష్టికి తీసుకువచ్చారు.వీలైనంత త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి హామీ ఇచ్చారు.డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్ సుబ్బారావు, సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేతలు భానుప్రకాష్‌రెడ్డి,సామంచి శ్రీనివాస్ , శ్రీహరిరావు, సుబ్రహ్మణ్య యాదవ్, చిట్టిబాబు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో మధ్యప్రదేశ్ న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), జూన్ 17: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర కువార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.



జస్టిస్ రాజేంద్రకుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో

తిరుపతి బస్టాండులో బ్లేడు బ్యాచ్

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 17: తిరుపతి బస్టాండులో కొంత కాలంగా బ్లేడు బ్యాచ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. రాత్రి 10 గంటల తర్వాత గంజాయి తాగడం, ముఠాలుగా ఏర్పడి ముష్టి యుద్ధాలకు దిగడం పరిపాటిగా మారిందని ఆర్టీసీ కంట్రోలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోకపోవడం, పోలీసు యంత్రాంగం ఇతర విధుల్లో నిమగ్నం కావడంతో బస్టాండు ప్రాంగణం గంజాయి, బ్లేడు బ్యాచ్‌లకు షెల్టర్ జోన్లుగా మారిపోయాయి. ప్రయాణికుల ముసుగులో కూర్చుని గంజాయి తాగుతున్నారని కంట్రోలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పీలేరు, రాయచోటి ప్లాట్‌ఫారాల వద్ద కొందరు యువకులు గంజాయి మత్తులో గొడవలకు దిగడంతో ప్రయాణికులు భయభ్రాంతులయ్యారు. మందుబాబులతో కూడా ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు..

శ్రీవారి సుప్రభాత సేవలో హీరో అజిత్

తిరుమల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తమిళ హీరో అజిత్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో పాల్గొన్న ఆయన అనంతరం గర్భాలయంలోకి వెళ్లి మూలమూర్తిని దర్శించుకున్నారు. అజిత్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.



తిరుమలలోని అతిథిగృహంలో అజిత్

హుండీ ఆదాయం రూ.4 కోట్లు: తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదివారం 69,870 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 42,119 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో తగ్గుతున్న భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులతో పోలిస్తే తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టింది. 15, 16, 17వ తేదీ వరకు వరుస సెలవులు కావడంతో శని, ఆదివారాలు తిరుమల క్షేత్రం భారీ భక్తుల సంఖ్యతో కిక్కిరిసిపోయిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి పనిరోజులు మొదలుకానున్న నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో ఉన్న భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆక్టోపస్ భవనం వరకు ఉన్న క్యూలైన్ బాటగంగమ్మ ఆలయం వరకు తగ్గింది. 36 గంటలు ఉన్న దర్శన సమయం 24 గంటలకు తగ్గింది. మంగళవారం ఉదయానికి రద్దీ మరింత తగ్గే అవకాశాలున్నాయి.

నెలాఖరు వరకు సెలవు పొడిగించండి

సీఎస్‌కు ధర్మారెడ్డి అభ్యర్థన

తిరుమల, జూన్ 17(ఆంధ్రజ్యోతి):ఈ నెలాఖరు వరకు తనకు సెలవు పొడిగించాలని టీటీడీ అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు లేఖ పంపారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల విడుదలైన రెండు రోజుల తరువాత ధర్మారెడ్డి తనకు సెలవు మంజూరు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం తిరుమల పర్యటనకు ముందు 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏడు రోజుల పాటు రాష్ట్రప్రభుత్వం సెలవు మంజూరు చేసింది. కొద్దిరోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన ఈవోగా శ్యామలరావును నియమించింది.ఈవో బాధ్యతలను ఆయనకు అప్పగించిన ధర్మారెడ్డి తనకు 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు లీవ్ కావాలంటూ సీఎస్‌కు లేఖలో విన్నవించుకున్నారు. ఈ నెలాఖరులో ఆయన పదవీవిరమణ చేయబోతున్న విషయం తెలిసిందే.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం

రెండు నెలల కాపురం తర్వాత పరార్

తెలంగాణ యువకుడిపై యువతి ఫిర్యాదు

గద్వాల క్రైం, జూన్ 17 : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ప్రేమకు. ఆపై సహజీవనానికి దారితీసింది.రెండు నెలలు కాపురం చేశాక మళ్లీ వస్తానంటూ వెళ్లిన ఆ యువకుడు తిరిగి రానేలేదు.అతడిని వెతుక్కుంటూ తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడుకు వెళ్లిన విద్యానగర్ యువతి ఉదంతమిది. సోమవారం గద్వాల డీఎస్పీ సత్యనారాయణకు ఆమె అందజేసిన ఫిర్యాదు మేరకు వివరాలివీ. కోట మండలం, విద్యానగర్‌కు చెందిన నిహారికకు మానవపాడు మండలం ఎ.బూర్దిపాడు గ్రామానికి చెందిన బషీర్ అనే యువకుడితో ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి కొద్దిరోజులు ఇద్దరూ సహజీవనం చేశారు. తనకు ఇంతకుముందే వివాహమై విడాకులు కూడా అయ్యాయని, తనకు ఇద్దరు సంతానం అని చెప్పినా కూడా బషీర్ ఎలాంటి ఇబ్బంది లేదన్నాడని నిహారిక తెలిపింది. ఈ ఏడాది మార్చి 18న ఆయన హిందూ సాంప్రదాయం ప్రకారం తాళి కట్టాడు.కొద్దిరోజులు ఇద్దరూ కాపురం చేశారు.తర్వాత తన తల్లికి ఆరోగ్యం బాగోలేదని అన్న మౌలాలీ ఫోన్ చేశాడని, వెళ్లి చూసి వస్తానని బషీర్ సొంతూరికి వెళ్లాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో చివరకు నిహారిక తన భర్త ఊరికి వచ్చి గత నెల 25న శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.అయితే ఎస్‌ఐ సంతోష్ అసభ్యకరంగా మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆమెను స్టేషన్‌లోనే ఉంచి భయభ్రాంతులకు గురిచేశాడు. సోమవారం బక్రీద్ పండుగ కనుక భర్త ఇంటికి వస్తాడని భావించి బూడిదపాడు గ్రామానికి చేరుకున్న నిహారికను బషీర్ అసభ్యకరంగా దూషిస్తూ దాడి చేశాడు. ఈ విషయాన్ని ఎస్ఐకి వివరించగా పట్టించుకోలేదు. దీంతో ఎస్ఐ సంతోష్‌పై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని డీఎస్పీ సత్యనారాయణకు సోమవారం నిహారిక ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ సంతోష్‌ను వివరణ కోరగా నిహారిక ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, అయితే కేసు వద్దంటోందన్నారు. ఇద్దరినీ కూర్చోబెట్టి రాజీచేయాలని, లేదా పరిహారం ఇప్పించేలా చూడాలని చెపుతుండడంతో అది తమ డ్యూటీ కాదని పోలీస్ స్టేషన్ బయట చూసుకోవాలని చెప్పినట్లు చెప్పారు. ఫిర్యాదు చేస్తే విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

ఘాట్‌రోడ్డులో అదుపు తప్పిన కారు

ముగురికి స్వల్పగాయాలు

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. మహారాష్ట్రకు చెందిన ఓ కుటుంబ శ్రీవారి దర్శనం ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఎలిఫెంట్ ఆర్చ్ దాటాక కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. కుడి వైపు దూసుకుపోయింది. చెట్టును ఢీకొని నిలిచిపోయింది. కారులోని ముగ్గురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

తిరుమల కాటేజీలో కట్లపాము



తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): తిరుమల కాటేజీలో కట్లపాము భక్తులను భయాందోళనకు గురిచేసింది. సోమవారం శ్రీవారిమెట్టుకు చివరిభాగంలోని టీబీసీ 50వ నెంబరు గల గది కిటికీకి ప్రమాదకరమైన పాము చుట్టుకుని ఉండటాన్ని భక్తులు గుర్తించారు. భయంతో బయటకు వచ్చి సమీపంలోని అధికారులకు సమాచారమిచ్చారు. ఫారెస్ట్ రేంజర్ శివకోటి తన బృందంతో వెళ్లి పామును పట్టుకున్నారు. అనంతరం దట్టమైన అడవిలో విడిచి పెట్టారు.

టెన్త్ టాపర్లకు సత్కారం



కుప్పం, జూన్ 17: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం నియోజకవర్గంలోని సుమారు 30 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2023-2024 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సత్కారం చేశారు. నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే కుప్పంలో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి గొడుగులు వితరణ చేశారు. ఈ సందర్భంగా సునీల్ రాజ్ మాట్లాడుతూ కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ద్వారా యువతకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించి పరిశ్రమలకు సిద్ధంగా తయారు చేస్తున్నామన్నారు. అలాగే బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్, కేఈసీ సీఈవో సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఆర్ అండ్ డి డైరెక్టర్ జీఎస్.కోదండ రామయ్య, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమర్‌కు పలువురి అభినందనలు



అమర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్

పలమనేరు, జూన్17 : పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సోమవారం పలువురు కలిసి అభినందనలు తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులిపర్తి నాని, పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఇక ప్రభుత్వ వైద్యాధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులు, ఆర్.ఎం.పీ. డాక్టర్ల అసోసియేషన్ నాయకులు, అంగన్వాడీ సంఘ నాయకురాళ్లు, దివ్యాంగుల సంఘ నాయకులు, పలువురు పోలీసులతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన నియోజకవర్గ నాయకులు సోమవారం అమరనాథరెడ్డిని టీడీపీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పార్టీ అధ్యక్షుడు, జిల్లా పార్టీ కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు నాగేశ్వరరాజు, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్, సీనియర్ నాయకులు ఆర్వీ.బాలాజి, బైరెడ్డిపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు కిషోర్‌గౌడు, పలమనేరు పట్టణ అధ్యక్షుడు ఆర్వీసీకుట్టి, పెద్దపంజాణి మండల అధ్యక్షుడు ఆనంద్ పాల్గొన్నారు.

మనోహరరెడ్డి మరణం తీరని లోటు

పలమనేరు, జూన్17 : పలమనేరులోని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా ఉన్న మనోహరరెడ్డి ఆకస్మిక మరణం సంఘానికి తీరని లోటని పలమనేరు ఎన్జీఓ సంఘ అధ్యక్షులు ఆనందబాబు, పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్షులు సుబ్రమణ్యం పిళ్లై పేర్కొన్నారు. పలమనేరు బసవన్న గుడి వీధిలోని మనోహరరెడ్డి నివాసంలో ఆయన మృతదేహానికి వారు నివాళులు అర్పించారు. వీరితో పాటు పీపీఎస్ సభ్యులు నారాయణ, రెడ్డెప్ప, దొరస్వామి, రామచంద్ర, తదితరులు అంజలి ఘటించారు.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఘన సన్మానం



శాంతిపురం, జూన్ 17 : మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శాంతిపురం మండల తెలుగు తమ్ముళ్లు సోమవారం అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి విజయరామిరెడ్డి, కెనమాకులపల్లె పంచాయతీ యూనిట్ ఇన్‌చార్జి జయారెడ్డి, గుంజార్లపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆర్ నాగరాజు, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఈడిగ సంఘం అధ్యక్షుడు శివశంకర్‌గౌడు, మండల టీడీపీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి క్యాబేజి మురళి, కెనమాకులపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ నేత పెద్దబొమ్మనపల్లె నాగరాజు ఉన్నారు.

అమ్మవారికి మొక్కులు చెల్లించిన గ్రామస్తులు



శాంతిపురం, జూన్ 17 : రాష్ట్రంలో కూటమి, కుప్పంలో చంద్రబాబు భారీ మెజారిటీతో ఘన విజయం సాధించడంతో చౌడంపల్లె గ్రామస్తులు గ్రామదేవతకు గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం గ్రామ పెద్దలు విజయకుమార్, శ్రీరాములురెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు చొరవతో కుప్పం నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అయ్యప్ప, కందస్వామి, రామచంద్ర, రాజప్ప, శంకరప్ప, శ్రీనివాసులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రిని కలసిన బీజేపీ నాయకులు



పుంగనూరు, జూన్17: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను సోమవారం తిరుపతిలో పుంగనూరు బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, మదన్‌బాబు, పెద్దమఠం బాబు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. పుంగనూరు ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషిచేయాలని కోరినట్లు తెలిపారు.

ఖాన్‌సాబ్‌మిట్టలో సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తా

చౌడేపల్లె, జూన్17: మండలంలోని 29ఏ -చింతమాకులపల్లె పంచాయతీ ఖాన్‌సాబ్‌మిట్టలో సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు పారిశ్రామికవేత్త టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ప్లాంట్‌కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, హరి, రెడ్డి, చిన్నికిశోర్, షావలి, షాజహాన్, మస్తాన్, అజీజ్‌వుల్లా పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

చౌడేపల్లె, జూన్17: బిల్లేరులో వెలసిన సీతారాముల ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, పత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు.

లక్ష్మీనరసింహుడి సన్నిధిలో ఏకాదశి వేడుకలు



కల్లూరు, జూన్ 17: పులిచెర్ల మండలం దేవళంపేటలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు అనంతకుమారాచార్యులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హోమం నిర్వహించారు. వివిధరకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు భక్తులకు ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. ఉభయదారులుగా కల్లూరుకి చెందిన రాధాకృష్ణ అయ్యంగార్ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

ముగిసిన బాటగంగమ్మ తిరుణాల



బాటగంగమ్మ పూజల్లో చల్లాబాబు

రొంపిచెర్ల,జూన్17: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ మేళ్లయ్య గారిపల్లెలోని బాటగంగమ్మ తిరుణాల సోమవారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిసింది. పూజాకార్యక్రమాలు, పుష్పపల్లకీ సేవ, అభిషేకాలు, అర్చనలు, వివిధనాటకాలు, హరికథ కాలక్షేపాలు నిర్వహించారు. ఈ పూజల్లో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



పుంగనూరు రూరల్, జూన్17: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యం బాటిళ్లను పోలీసులు సోమవారం ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారు. చిత్తూరు ఎస్ఈబీ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు, పుంగనూరు సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో 39 కేసుల్లో పట్టుబడిన 495లీటర్ల కర్ణాటక మద్యాన్ని ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారు. మద్యం విలువ రూ.44,900 ఉంటుందని తెలిపారు.

మల్లేశ్వరస్వామికి అభిషేకపూజలు



సోమల, జూన్ 17: ఇరికిపెంట పంచాయతీ మధురమలై కొండలో కొలువుదీరిన మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు అభిషేక పూజలు నిర్వహించారు. చెన్నపట్నం చెరువు నుంచి భక్తులు కాలినడకన శివనామస్మరణలతో మధురమలై కొండకు చేరుకుని ఆలయ శుద్ధిచేశారు. అనంతరం అభిషేకపూజలు జరిపారు. ఈ పూజల్లో రాశెట్టివారిపల్లె, పాయలవారిపల్లె, మునిరెడ్డిగారిపల్లె, ఇరికిపెంట, సోమల భక్తులు పాల్గొన్నారు.

బాబుతోనే బీసీల అభివృద్ధి



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యాదవులు

కుప్పం, జూన్ 17: బీసీల అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని యాదవ సంఘం నేతలు పేర్కొన్నారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాల్గవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, బీసీల అభ్యున్నతికి కచ్చితంగా కృషిచేస్తారని, ఆయన సారథ్యంలో అన్ని రంగాలూ, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. యాదవ సంఘం నేతలతోపాటు చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, శ్రీనివాసరావు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వీజీ.ప్రతాప్, శాంతారాం, భార్గవ్, కాణిపాకం వెంకటేశ్, మంజునాథ్ పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేద్దాం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూన్ 17: సమన్వయంతో అభివృద్ధికి కృషిచేద్దామని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనసేన, బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం కూటమి పక్షాల నేతలందరూ సమన్వయంతో కృషి చేద్దామన్నారు. ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా కూటమి భాగస్వామ్య పక్షాలను అందులో భాగస్వాములను చేస్తామన్నారు. ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి అపోహలు వద్దన్నారు. పొరబాట్లు జరిగిగా సరిదిద్దుకుందామన్నారు. పొరబాట్లు జరిగితే సోషల్‌మీడియా వేదికగా బహిర్గతం చేయకుండా తమ మండల కమిటీ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు హరీష్, వెంకటేశ్, నేతలు గజేంద్ర, బాలరాజు, సుప్రీ, అవినాశ్, అమరనాథ్, భానుమూర్తి, పవన్, గంగాధర్, షహన్నా, భాస్కర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొన్న భూమి తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి
మనస్తాపంతో యువరైతు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న యుగంధర్

పెద్దపంజాణి, జూన్ 17: కొనుగోలు చేసిన భూమి తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పెద్దపంజాణి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వీరప్పల్లె పంచాయతీ కెళవాతి గ్రామానికి చెందిన శ్రీనాథ్ కుమారుడు యుగంధర్(29) కొంత కాలం క్రితం అదే గ్రామానికి చెందిన క్రిష్ణప్ప వద్ద వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నాడు. దీనికోసం ఉన్న బంగారు నగలు తాకట్టు పెట్టడమే గాక పలువురి వద్ద అప్పులు చేశాడు. ఆ భూమిలో ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో భూమి అమ్మిన క్రిష్ణప్ప తన భూమి తనకే కావాలని గొడవ చేసేవాడు. గ్రామంలో పెద్దమనుషుల వద్ద పంచాయతీ చేసినా క్రిష్ణప్ప వినిపించుకోలేదు. మనస్తాపానికి గురైన యుగంధర్ ఆదివారం రాత్రి ఇట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎన్‌హెచ్‌పై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..అడ్డుకున్న స్థానికులు



నిరసన వ్యక్తం చేస్తున్న పెంచుపల్లె గ్రామస్తులు

పుంగనూరు, జూన్17: పుంగనూరు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి చెందిన జే.టౌన్ వెంచర్ కోసం విద్యుత్ అధికారులు జాతీయ రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండగా సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. పట్టణ సమీపంలో చిత్తూరు- కర్నూలు బైపాస్ జాతీయ రహదారిలో కొంతకాలంగా జే టౌన్ పేరుతో భారీ వెంచర్ నిర్మాణం జరుగుతోంది. ఈ వెంచర్ అవసరాల కోసం పెంచుపల్లె క్రాస్ సమీపంలో జాతీయ రహదారికి 3 అడుగుల దూరంలో రోడ్డుపై ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేస్తుండగా పాముల హరి, అస్రఫ్‌హుసేన్‌లతో పాటు గ్రామస్తులు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుకు అనుకుని ఎలా ఏర్పాటు చేస్తారని నిలదీశారు. దీనివల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌పార్మర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సన్నితుడు. దీంతో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకు అనమతించారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంపై వివరణ కోరడానికి విద్యుత్ ఏడీఈ రవికుమార్‌ను సంప్రదించగా అనుమతుల గురించి రికార్డులు పరిశీలించి చెబుతానన్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు.. మహిళకు తీవ్ర గాయాలు



పుంగనూరు రూరల్, జూన్17: పుంగనూరు- రామసముద్రం మార్గంలోని శుభారాం డిగ్రీకాలేజీ సమీపంలో కారు ఇంట్లోకి దూసుకెళ్లడంతో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన సోమవారం పుంగనూరులో చోటు చేసుకుంది. శుభారాం డిగ్రీ కాలేజీలో పాపులమ్మ(55)వాచ్‌మన్‌గా పని చేస్తోంది. ఆమె కళాశాల సమీపంలోని ఓ హోటల్ ముందు నిలబడి ఉంది. ఆ సమయంలో ఓ పుంగనూరు వైపు నుంచి అతివేగంగా వెళుతూ ఓ వాహనాన్ని ఢీకొని అనంతరం పాపులమ్మను ఢీకొని హోటల్లోకి దూసు కెళ్లింది. ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించినట్లు తెలిసింది.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సుబ్రమణ్యం

వి.కోట, జూన్ 17: వి.కోట మండలం కొంగాటం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుటుంబ కల హాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు య త్నించాడు. కొంతకాలంగా సుబ్రమణ్యం దంపతుల మధ్య గొడవలున్నాయి. ఈ క్రమంలో భార్య తనను దూరం పెడుతోందని అనుమానించాడు. ఇందుకు ఓ వ్యక్తి కారణమని అతడి నుంచి తనకు ప్రాణహాని ఉందని అనుమానితుడికి సంబంధించిన వారి ఫోన్‌కు సోమవారం ఉదయం మెసేజ్ చేశాడు. మధ్యాహ్నం పురుగులు మందు తాగుతూ స్నేహి తులకు ఫోన్‌చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలియజేశాడు. వారు వెంటనే అతడి వద్దకు చేరుకున్నారు. అప్పటికే అతడు అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుప్పం పీఈఎస్‌కు తీసుకెళ్లారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



రామకుప్పం, జూన్ 17: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం అర్చకులు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వైసీపీ కన్వీనర్‌కు గాయాలు

గంగవరం, జూన్ 17: మండలంలోని కొత్తపల్లె సమీపంలో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గంగవరం వైసీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మోహన్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంలో పొలం వద్దకు వెళ్లివస్తుండగా చెరువు గట్టు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ప్రమదంలో మోహన్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్న క్యాంటీన్ భవనాలను ఖాళీ చేయాలి

చిత్తూరు సిటీ, జూన్17: వైసీపీ నేతలు ఆక్రమించిన అన్న క్యాంటీన్ భవనాలను తక్షణం ఖాళీ చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ 2019 లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లను కొందరు వైసీపీ నేతలు ఆక్రమించారని తెలిపారు. ఈ భవనాల్లో వారు సొంత వ్యాపారాలు చేసుకున్నారని పేర్కొన్నారు. కొన్నిచోట్ల సచివాలయాలుగా వినియోగిస్తున్నారని చెప్పారు. పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ భవనాలను తక్షణం ఖాళీ చేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఇప్పటికీ నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, నేతలు మోహన్‌రాజ్, మధుయాదవ్, బాలకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరుడికి పాలాభిషేకం

వెదురుకుప్పం, జూన్ 17: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అన్నమయ్య, శివ సంకీర్తనలను ఆలపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈద్గాల్లో ముస్లింల ప్రార్థనలు



కల్లూరు ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కుప్పనం, జూన్ 17: బక్రీద్ పర్వం, దైవ ప్రవక్త త్యాగనిరతికి చిహ్నమని మతపెద్దలు పేర్కొన్నారు. కుప్పంలో సోమవారం బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ముస్లిలలు ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పేద, గొప్ప తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా పరస్పరం ప్రేమను కలిగి ఉండాలన్నారు. టీడీపీ నేతలు పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు, రాజ్‌కుమార్ తదితరులు బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

కల్లూరు: పులిచెర్ల మండలంలోని కల్లూరు, పులిచెర్ల, చిట్టారెడ్డిపేట, కొక్కువారిపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి, గేటుకాడబెస్తపల్లి, తురకపేట, మంగళంపేట, కొత్తపేట, సువారపువారిపల్లి తదితర ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద మతు గురువులు ప్రార్థనలు చేశారు. వస్తువులు, దుస్తులు ఆహారధాన్యాలు దానం చేశారు.

రొంపిచెర్ల: మండలంలోని ముస్లింలు కుర్బానీ పంచారు. టీడీపీ నాయకులు హయత్‌బాష, గౌస్‌పీర్‌ఖాన్, కరీముల్లా, ఇమ్రాన్, అంజాద్, మహమ్మదాలి, రజాక్ తదితరులు చల్లా రామచంద్రారెడ్డితో కలిసి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

సోమల: సోమల, నంజంపేట, పెద్దఉప్పరపల్లె, కందూరు, ఇరికిపెంట తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగ పురస్క రించుకుని ముస్లింలు ఈద్గా వద్దకు ప్రదర్శనగా వెళ్లారు. మత గురువులు బోధనలు చేశారు.

పలమనేరు: పలమనేరులో ముస్లింలు ఎద్దుల సంత వీధిలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ● పలమనేరులో ముస్లింలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం నాయకులు అమరనాథరెడ్డిని టీడీపీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముస్లిం నాయకులు ఖాజాపీర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పరీష్, మాబాషా, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలోని క్రిష్ణాపురం, కేపీమిట్ట, రాళ్లబూదుగూరు, శాంతిపురం, వెంకటేపల్లె, నంజంపేట, తుమ్మిశి రోడ్డు, కనమలదొడ్డి, సోగడబల్ల, తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సదుం: సదుం మండలంలోని ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖబరస్థాన్‌లకు చేరుకుని తమ పూర్వీకుల సమాధుల వద్ద నివాళులు అర్పించారు.

చౌడేపల్లె: మండలంలోని మేదరదొడ్డి, కోటూరు, దాదేపల్లె, ఖాన్‌సాబ్‌మిట్ట, పెద్దూరు, కొండయ్యగారిపల్లె, లద్దిగం, చౌడేపల్లెతో పాటు పలు గ్రామాలలో ముస్లింలు బక్రీద్ వేడుకలు నిర్వహించారు.

వి.కోట: ఖాజీపేట, రహమత్‌నగర్, మసీదు వీధుల్లోని ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద సీఐ లింగప్ప, ఎస్సై బాబుల నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

రామకుప్పం: రామకుప్పం పట్టణంలోని జామియా, మదీనా, మక్కా మసీదుల్లో ఉదయం ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం మసీదుల అభివృద్ధి కోసం విరాళాలు సేకరించారు. కుర్బానీ పంచిపెట్టారు. కొంగనపల్లె, బైపరెడ్లపల్లె, రాజుపేట, గెర్నిపల్లె, లింగాపురం, గొరివిమాకులపల్లె, పల్లెకుప్పం, 89పెద్దూరు, బల్ల, సింగసముద్రం, విజలాపురం, గోవిందపల్లె, కెంచనబల్ల తదితర గ్రామాల్లో ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పుంగనూరు: ఉదయం కొద్దిపాటి వర్షం కారణంగా ముస్లింలు ఈద్గాలకు వెళ్లలేకపోవడంతో సమీప మసీదులు, ఇళ్లల్లో ప్రార్థనలు చేసుకున్నారు. పేదలకు మాంసం, దుస్తులు, నగదు, అన్నదానం చేశారు. సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐలు రఫీ, సుబ్బారెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.







రొంపిచెర్ల, రామకుప్పం ఈద్గాల వద్ద ప్రార్థనల్లో ముస్లింలు, ● శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో మసీదులో ప్రార్థనలు చేసేందుకు ర్యాలీగా వెలుతున్న ముస్లింలు

వేతన బకాయిలు చెల్లించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డెయిరీ కార్మికులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 17: వేతన బకాయిలు చెల్లించాలని చిత్తూరు విజయా డెయిరీ కార్మికులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట వారు చేపట్టిన దీక్ష సోమవారానికి 279వ రోజుకు చేరింది. కార్మికుడు పీడీ కుమార్ మాట్లాడుతూ వేతన బకాయిలు చెల్లించాలని దీక్షలు చేస్తే గత ప్రభుత్వం తమను మోసం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా న్యాయం చేయాలని కోరారు. కార్మికుల్లో ఇప్పటికే 25 మంది చనిపోగా, మరో 25 మంది అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. తమ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని కోరారు. కార్మికులు ఎబినేజర్, భాస్కర్, రవి, కృష్ణయ్య, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రవీణ్ ప్రకాష్‌ను బదిలీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాష్

చిత్తూరు (సెంట్రల్), జూన్ 17: ఉపాధ్యాయులను మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను వెంటనే బదిలీ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.జయప్రకాష్ కోరారు. సోమవారం మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మార్పులు, బోధన పేరుతో ఉపాధ్యాయులను ప్రవీణ్ ప్రకాష్ తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, గౌరవాధ్యక్షుడు వీరరాఘవులు, భాస్కర్, బాలాజి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మసీదుకు విరాళం



చంద్రప్రకాష్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

చిత్తూరు రూరల్, జూన్ 17: చిత్తూరు రూరల్ బీఎన్ఆర్ పేట మసీదుకు బక్రీద్ సందర్భంగా టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధికి టీడీపీ పెద్దపీట వేస్తుందని తెలిపారు. అనంతరం ముస్లింలను ఆయన సన్మానించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, జాఫర్, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శరశ్చంద్ర

గుడిపాల, జూన్ 17: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని బొమ్మసముద్రం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శరశ్చంద్ర అన్నారు. మండలంలోని గట్రాళ్లమిట్ట, బొమ్మసముద్రం గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ కళాశాలలపై ప్రజలకు అవగాహన కల్పించి, పిల్లలను చేర్పించాలని కోరారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

గురజాల గెలిచారని..



గుడిపాల, జూన్ 17: చిత్తూరు ఎమ్మెల్యేగా గురజాల జగన్మోహన్ నాయుడు గెలవడంతో గుడిపాల టీడీపీ నాయకులు సోమవారం తిరుమలలో మొక్కులు చెల్లించారు. ఇందులో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు ఉదయ, నాయకులు జగదీశ్వర్ నాయుడు, సారథి, శిల్ప, పుష్ప తదితరులు ఉన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



తవణంపల్లె, జూన్ 17: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సప్తదేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలవిరాట్లకు తిరుమంజనం, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాల నడుమ పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



తవణంపల్లె, జూన్ 17: మండలంలోని కొత్తగొల్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నేతలు సోమవారం తిరుమలకు పాదయాత్రగా పయనమయ్యారు. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తే నడిచి కొండకు వస్తామన్న మొక్కు చెల్లించుకునేందుకు వెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్‌నాయుడు సంఘీభావం తెలిపారు. టీడీపీ నాయకులు శంకర్‌యాదవ్, చిట్టెమ్మ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ

- నలుగురికి తీవ్రగాయాలు



గుడిపాల, జూన్ 17: మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి మద్రాస్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పలమనేరు నుంచి ధనకాచారి, లలిత, కీర్తన కారులో కంచికి బయలుదేరారు. చెన్నైకు చెందిన సహన తిరుపతి నుంచి కారులో వెళుతున్నారు. మద్రాస్ క్రాస్ వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. పలమనేరుకు చెందిన ముగ్గురికి, సహనకు గాయాలయ్యాయి. వారిని సీఎంసీ అస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కన్నికలమ్మకు పూజలు



పాలసముద్రం, జూన్ 17: చంద్రబాబు సీఎం కావడం, థామస్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మండలంలోని నిశ్శంకాపురంలో సోమవారం కన్నికలమ్మకు గ్రామస్తులు పూజలు చేసి, పొంగళ్లు పెట్టారు. పూజల అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, నాయకులు వాసునాయుడు, జె.విజయ్‌కుమార్, వెంకటేశులు నాయుడు, రవి నాయుడు, నారాయణ నాయుడు, శేఖర్ రాజు, చెంగమ నాయుడు పాల్గొన్నారు.

జాతర చాటింపు

పాలసముద్రం, జూన్ 17: పాలసముద్రంలో మంగళవారం జాతర చాటింపు వేశారు. గ్రామంలోని చెరువుకలుజు వద్ద ఆదివారం రాత్రి పొంగళ్లు పెట్టి, మేకపోతును బలిచ్చి చాటింపు వేశారు. సోమవారం ఉదయం, సాయంత్రం గ్రామస్తులు గరిగెను ఊరేగించారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం

పాలసముద్రం, జూన్ 17: మండలంలోని కృష్ణజిమ్మాపురం ధర్మరాజులస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం ద్రౌపదీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. పాండవులు, ద్రౌపది విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి, కల్యాణం చేశారు. భక్తులు హాజరై ఈ తంతును తిలకించారు. ఆలయ ధర్మకర్త బాలయ్య నాయుడు అన్నదానం చేశారు.

మోటారు వైర్ల చోరీ



శ్రీరంగరాజపురం, జూన్ 17: మండలంలోని పలు గ్రామాల్లో మోటారు వైర్లు చోరీకి గురవుతున్నాయి. గతంలో మూలూరు, పిళ్లారికుప్పం, పద్మాపురం, ముద్దికుప్పం, 49.కొత్తపల్లెమిట్టలో వైర్లు చోరీకి గురయ్యాయి. తాజాగా ఆదివారం రాత్రి 49.కొత్తపల్లె సర్పంచ్ డి.వి.ఢిల్లెయ్యకు చెందిన మోటారు వైర్లను చోరులు పట్టుకెళ్లారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. పోలీసులు నిఘా పెంచాలని కోరుతున్నారు.

కొండమల్లీశ్వరుడికి పాలాభిషేకం



వెదురుకుప్పం, జూన్ 17: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నమయ్య, శివ సంకీర్తనలను ఆలపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

నేడు గంగ జాతర

చిత్తూరు కల్చరల్, జూన్ 17: నగరంలోని న్యూప్రశాంత్‌నగర్‌లో మంగళ, బుధవారాల్లో నడివీధి గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామచంద్ర, సౌందరరాజన్, శ్రీనివాసులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

25, 26తేదీల్లో గుండాలమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, జూన్ 17: స్థానిక అశోక్‌పురంలో ఈనెల 25, 26తేదీల్లో గుండాలమ్మ జాతర నిర్వహించనున్నారు. తొలిరోజు విగ్రహ ప్రతిష్ఠ, అంబలి సమర్పణ, పొంగళ్లు, కుంభ నైవేద్యం ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్య శాఖ మంత్రికి సన్మానం



పూతలపట్టు, జూన్ 17: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను టీడీపీ నగర కార్యదర్శి, పూతలపట్టు మండల టీడీపీ నేత కృష్ణమూర్తి యాదవ్ సోమవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. నాయకులు దయ, రెడ్డెప్ప రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

నానికి సన్మానం



వెదురుకుప్పం, జూన్ 17: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని జీడీ నెల్లూరు నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి సోమవారం కలసి అభినందనలు తెలిపారు. శాలువ కప్పి సన్మానించారు.

ఈ బొమ్మ సంగతేంటి?



కార్వేటినగరం ప్రభుత్వ వైద్యశాల గోడపై మాజీ సీఎం జగన్ బొమ్మ అలాగే ఉండడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం మారినా బొమ్మ మార్చకపోవడంపై అక్కడికి వచ్చిన రోగులు చర్చించుకుంటున్నారు. **- కార్వేటినగరం**

భక్తిశ్రద్ధలతో బక్రీద్



జీడీ నెల్లూరు మండలం ఆవలకొండ ఈద్గా మైదానంలో ప్రార్థనలు



ముస్లింలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు కల్చరల్, జూన్ 17: జిల్లావ్యాప్తంగా సోమవారం బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చిత్తూరు గిరింపేట ఈద్గా మైదానంలో ముస్లిం లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్వమత ఐక్యతే ఖురాన్ అని, సమాజంలో అందరూ కలిసిమెలసి జీవించాలనేదే దాని అభిమతమని ప్రొఫెసర్ అన్వర్ హుస్సేన్ పేర్కొన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పాల్గొన్నారు. హిందూ ముస్లింలు ఐక్యతతో నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

గంగాధరనెల్లూరు : మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామంలో అజా ఖనాయే జహారాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ ప్రత్యేకత గురించి ప్రభుత్వ ఖాజీ మౌలానా అలీ అక్బర్, మతగురువు నబీల్‌రిజా మౌలానా వివరించారు. గంగాధరనెల్లూరు అబ్బాస్‌కాలనీ, వీరకనెల్లూరు, ఆవలాపురం ముస్లిం కాలనీ, బాలగంగనపల్లె గ్రామాల్లోనూ బక్రీద్ జరుపుకున్నారు.

గుడిపాల : మండలంలోని గట్రాళ్లమిట్ట, 190 రామాపురం, కోటూరు, గుర్రాలమిట్ట, రాసనపల్లి తదితర గ్రామాల్లో కేక్ కట్‌చేసి, పండుగ జరుపుకున్నారు. జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు రమేష్ నాయుడు, శంకర్ చౌదరి, ఇంతియాజ్, శేఖర్, చిన్నబ్బ నాయుడు, మధుసూదన్ నాయుడు, బాబు, రవి నాయుడు, చల్లా, ఆనంద్ యాదవ్ పాల్గొన్నారు.

ఐరాల : మండలంలో ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి, మసీదుల్లో ప్రార్థనలు చేశారు. తక్బీర్ పఠిస్తూ వీఎస్.అగ్రహారం వద్దనున్న ఈద్గా వద్దకు వెళ్లారు. బంధువులకు, మిత్రులకు కుర్బాని, కీరు పంచారు.

బంగారుపాళ్యం : బంగారుపాళ్యం జామియా మసీదు నుంచి ర్యాలీగా మొగిలి వెంకటగిరి వద్దకు చేరుకుని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వెదురుకుప్పం : త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ తోకల మురళిరెడ్డి అన్నారు. మండలంలోని వేపేరి, తాటిమాకులపల్లె, పచ్చికాపల్లంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది



గురజాల, చంద్రప్రకాష్‌లను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు రూరల్, జూన్ 17: ఎన్నికలో పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ అన్నారు. సోమవారం చిత్తూరు పార్టీ కార్యాలయంలో రూరల్ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. సమష్టి కృషి వల్లే చిత్తూరు మండలంలో 3,800 ఓట్ల మెజారిటీ వచ్చిందన్నారు. పంచాయతీల్లో చేయాల్సిన అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేస్తామన్నారు. అనంతరం నాయకులు గురజాల, చంద్రప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడులను సన్మానించారు. నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, నీలకంఠనాయుడు, జగదీష్ నాయుడు, కుమార్, రాజా, దేవరాజులు నాయుడు, రమేష్‌నాయుడు, బాలకృష్ణ నాయుడు, కాశీ, గురేష్, సురేష్, మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవనాలను ఖాళీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్17: వైసీపీ నేతలు ఆక్రమించిన అన్న క్యాంటీన్ భవనాలను తక్షణం ఖాళీ చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లను కొందరు వైసీపీ నేతలు ఆక్రమించారని తెలిపారు. ఈ భవనాల్లో వారు సొంత వ్యాపారాలు చేసుకున్నారని పేర్కొన్నారు. కొన్నిచోట్ల సచివాలయాలుగా వినియోగిస్తున్నారని చెప్పారు. పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ భవనాలను తక్షణం ఖాళీ చేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఇప్పటికీ నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, నేతలు మోహన్‌రాజ్, మధుయాదవ్, బాలకృష్ణ నాయుడు, బాబు నాయుడు, రామచంద్రయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలకు పరిష్కారం చూపాలి



సమావేశంలో ఆపస్ జిల్లా ప్రతినిధులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 17: విద్యారంగంలో సమస్యలకు పరిష్కారం చూపాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ్ (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా వాసి బాలాజి కోరారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో మూడు రోజుల పాటు జరిగిన అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం, ఏకీకృత సర్వీసు రూల్స్, జాతీయ నూతన విద్యావిధానం, పాఠశాలల విలీనం రద్దు, టీచర్లకు బోధనేతర పనుల నుంచి విముక్తి తదితర అంశాలపై ప్రస్తావించినట్లు ఆయన పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 17: మొక్కలను సంరక్షించడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని 35వ ఆంధ్ర బెటాలియన్ క్యాంపు కమాండర్ కల్నల్ నోయిల్ వివేక్ మోనిషా పేర్కొన్నారు. 35 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు సోమవారం అటవీ శాఖ ప్రాంగణంలో మొక్కలు నాటారు. వివేక్ మోనిషా మాట్లాడుతూ మొక్కల సంరక్షణ ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించగలమన్నారు. మేజర్ లోకనాథన్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, మెగిలి, చైత్రి పాల్గొన్నారు.

వర్షపు నీటిని తొలగించండి



కళియంబాకం మార్గంలో నిలిచిన నీరు

విజయపురం, జూన్ 17: చిత్తూరు - తచ్చూరు హైవే పనులు జరుగుతుండడంతో మండలంలోని కళియంబాకం, సామిరెడ్డి కండ్రిగ, సామిరెడ్డి కండ్రిగ వడ్డిండ్లకు వెళ్లేందుకు రోడ్డు కింది భాగంలో వంతెనలా ఏర్పాటు చేశారు. ఇది పల్లంగా ఉండడంతో తేలికపాటి వర్షం కురిసినా నీరు నిల్వ చేరుతోంది. తద్వారా పాదచారులు, వాహనదారులు అవస్థ పడుతున్నారు. ద్విచక్ర వాహనం అదుపు తప్పితే బురదలో పడాల్సిందే. పాదచారులు బురదలో దిగితే తప్పా ముందుకు వెళ్లలేని పరిస్థితి. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

మాజీ మేయర్‌కు సన్మానం



చిత్తూరు సిటీ, జూన్ 17: మాజీ మేయర్ కటారి హేమలతను సోమవారం పలు ఉద్యోగ సంఘాల నేతలు సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసినందుకు హేమలతను నగరంలోని ఆమె నివాసంలో రాయల్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) వ్యవస్థాపక అధ్యక్షుడు పుంగనూరు నానబాల లోకేష్ రాయల్, ఉపాధ్యక్షుడు డేగల యుగంధర్, బాల సురేంద్రబాబు, ప్రభాకర్, చరణ్, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు శివయ్య, దేవినేని నరేష్‌బాబు సన్మానించారు.

కలసికట్టుగా అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే థామస్‌ను సన్మానిస్తున్న మోహన్‌మురళి

వెదురుకుప్పం, జూన్ 17: అందరూ కలసికట్టుగా అభివృద్ధి పనులు చేయాలని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎమ్మెల్యే థామస్ అన్నారు. వెదురుకుప్పం తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళి ఇంట్లో ఆయనకు సోమవారం సన్మానం చేశారు. వేణుగోపాలపురానికి చెందిన ఎస్సీ సెల్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీఎం రవి ఎమ్మెల్యేను సత్కరించారు. నియోజకవర్గ టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన



విజయపురం, జూన్ 17 : మండలంలోని ఇళ్లత్తూరులో సోమవారం వీబీఎస్ సిబ్బంది ఉపాధి కూలీలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మండల కౌన్సిలర్ జాన్‌సుభాకర్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతా కలిగి ఉండాలన్నారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సంవృద్ధి యోజన పథకాలు, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు.. మహిళకు తీవ్ర గాయాలు



ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

పుంగనూరు రూరల్, జూన్17: పుంగనూరు- రామసముద్రం మార్గంలోని శుభారాం డిగ్రీకాలేజీ సమీపంలో కారు ఇంట్లోకి దూసుకెళ్లడంతో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన సోమవారం పుంగనూరులో చోటుచేసుకుంది. శుభారాం డిగ్రీ కాలేజీలో పాపులమ్మ(55)వాచ్‌మన్‌గా పని చేస్తోంది. ఆమె కళాశాల సమీపంలోని ఓ హోటల్ ముందు నిలబడి ఉంది. ఆ సమయంలో ఓ పుంగనూరు వైపు నుంచి అతివేగంగా వెళుతూ ఓ వాహనాన్ని ఢీకొని అనంతరం పాపులమ్మను ఢీకొని హోటల్లోకి దూసు కెళ్లింది. ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించినట్లు తెలిసింది.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సుబ్రమణ్యం

వి.కోట, జూన్ 17: వి.కోట మండలం కొంగాటం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కొంత కాలంగా సుబ్రమణ్యం దంపతుల మధ్య గొడవలున్నాయి. ఈ క్రమంలో భార్య తనను దూరం పెడుతోం దని అనుమానించాడు. ఇందుకు ఓ వ్యక్తి కారణమని అతడి నుంచి తనకు ప్రాణహాని ఉందని అనుమాని తుడికి సంబంధించిన వారి ఫోన్‌కు సోమవారం ఉద యం మెసేజ్ చేశాడు. మధ్యాహ్నం పురుగుల మందు తాగుతూ స్నేహి తులకు ఫోన్‌చేసి ఆత్మహత్య చేసుకుం టున్నట్లు తెలియజేశాడు. వారు వెంటనే అతడి వద్దకు చేరుకున్నారు. అప్పటికే అతడు అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుప్పం పీఈ ఎస్‌కు తీసుకెళ్లారు.

కొన్న భూమి తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి.. మనస్తాపంతో యువరైతు ఆత్మహత్య



పెద్దపంజాణి, జూన్ 17: కొనుగోలు చేసిన భూమి తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పెద్దపంజాణి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వీరప్పల్లె పంచాయతీ కెళవాతి గ్రామానికి చెందిన శ్రీనాథ్ కుమారుడు యుగంధర్(29) కొంత కాలం క్రితం అదే గ్రామానికి చెందిన క్రిష్ణప్ప వద్ద వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నాడు. దీనికోసం ఉన్న బంగారు నగలు తాకట్టు పెట్టడమే గాక పలువురి వద్ద అప్పులు చేశాడు. ఆ భూమిలో ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో భూమి అమ్మిన క్రిష్ణప్ప తన భూమి తనకే కావాలని గొడవ చేసేవాడు. గ్రామంలో పెద్దమనుషుల వద్ద పంచాయతీ చేసినా క్రిష్ణప్ప వినిపించుకోలేదు. మనస్తాపానికి గురైన యుగంధర్ ఆదివారం రాత్రి ఇట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.